# దేశం బాగుపడాలంటే

★ శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి ★

ఆ వూళ్లో బళ్లో పిల్లలందరిలోను శేఖర్ అతి తెలివైనవాడని ప్రతీతి. దానినిబట్టి శేఖర్ అంటే మాష్టరుగారికే కాక ఆ వూళ్లో వాళ్లందరికికూడ అతి ప్రేమ; అతి చనువు. ఎప్పటికైనా మన వూరుకు పేరురావా లంటే మన శేఖర్ వల్లనే అంటూవుంటారు. శేఖర్ వయస్సుకూడ అట్టేలేదు. పది పన్నెండు సంవత్సరాలుంటాయి. మన పెద్దవాళ్లు కుశాగ్రబుద్ధి అన్న ప్రయోగను శేఖర్ విషయంలో అక్షరాల సరిపో యింది. అతని తెలివితేటలకు తోడు, పెద్దలపట్ల వినయము విధేయత, అతనిని అందలము మీదికి యెక్కించేసినాయి.

పిల్లలలో అనేకరకాలు వుంటారు కాబట్టి, కొంతమంది శేఖర్ నుచూసి అసూయపడేవారు, కొంతమంది ఆనంద పడేవారు తయారయ్యారు. శేఖర్ మాత్రం వీళ్లందరిపట్ల ఒకేవిధంగా ప్రవర్తిస్తూ వస్తు న్నాడు. ఇన్స్పెక్టరుగారువచ్చినా, డి. ఇ. ఓ వచ్చినా, ధాటిగా సమాధానాలు చెప్పేస్తాడు అనే ధైర్యం ఆ మాస్టారు గారికి కలిగింది. శేఖర్ లేకపోతే పెద్ద వాళ్లచేత చివాట్లు తప్పేవికావు అని అను కుంటూవుండేవాడు ఆ మాస్టరుగారు.

ఒకనాడు అనుకోకుండా ఇన్స్పెక్షన్ చెయ్యటానికి డి. ఇ. ఓ గారు వస్తున్నా రని కబురొచ్చింది మాస్టారుగారికి. ఆయన వంటినిండా తేళ్లు ప్రాకినట్లయింది. వెంటనే శేఖర్ ను పిలిపించి యీ విష యముచెప్పి మన స్కూలుగౌరవము అంతా నీ చేతిలోవుంది. ఎట్లా నిలపెడతావో అంటూ జాలిగా అడిగాడు. 'ఏం ఫరవా లేదండి మాస్టారుగారూ ఏ ప్రశ్నలు యిచ్చినా సమాధానాలు చెప్పేస్తాను' అంటూ ధైర్యంగా సమాధానం చెప్పాడు శేఖర్. మాస్టరుగారుచాలాసంతోషించాడు.

మర్నాడు ఇన్స్పెక్షన్. పిల్లలందరు ప్రొద్దున్నే లేచి, సూర్యోదయం కాక మునుపే, ముఖప్రక్షాళన, స్నానాదులు పూర్తిచేసుకొని, అమ్మ పెట్టిన వేడి వేడి అన్నం కడుపునిండా తిని, బళ్ళోకి బయలు దేరారు, లేత కిరణాలు ముఖాన పడు తుంటే ముఖాలు చిట్లించుకుంటూ. శేఖర్ తల్లికి నమస్కారం చేసి బయలుదేరాడు బళ్ళోకి.

డి. ఇ. ఓ గారు మాస్టరుగార్ని స్కూలుకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేసిన తర్వాత, యిక పిల్లలను ప్రశ్నలు వెయ్య టానికి పిల్లల గదిలోకి వచ్చాడు. అందరు నుంచొని జైహింద్ అంటూ ఆయనకు స్వాగతం యిచ్చారు. ఆయన చాలా సంతోషించి, పిల్లల క్రమశిక్షణకు మాస్టరు గారిని అభినందించాడు. మాస్టరుగారికి సగంబలం చేకూరింది. ఇక డి. ఇ. ఓ గారు ప్రశ్నలు వెయ్యటం ప్రారంభించాడు. భూమి యెట్లా వుంటుంది అనే పాతకాలపు భూగోళపు ప్రశ్నదగ్గరనుంచి, మన దేశము


## భావిపౌరులకు బాపూజీ సందేశం

"ఏనాటికో ఒకనాటికి చని పోవటానికే మనమంతా బ్రతు కుతున్నాం. చచ్చిపోయాక కూడా మళ్లీ మనమందరమూ జన్మ లెత్తుతాం. ఈ విష యాన్ని మనం బాగా గుర్తు వుంచుకొన్నంతవరకు జనన మరణాలవల్ల మోద ఖేదాలు పొందటం అనవసరమని అవ గతమౌతుంది. కాబట్టి మన మందరమూ చావు బ్రతుకు లను గూర్చి ఆందోళను విడ నాడి, యీ జన్మలో మనచేత ఏ పని చేయించాలని ఆ విధాత మనను యీ భూమి మీదికి పంపాడో, ఆ పనిని ఆజన్మాంతం చేస్తూ వుండ టమే మన కర్తవ్యం' మీమీ కర్తవ్యం ఏమిటో తెలుసుకో వాలనుకుంటే అందుకు మీ ఆత్మలే సాక్షి. మీ ధర్మాన్ని మీరొకసారి గుర్తిస్తే యిక ఆ మార్గాన్ని విడనాడకండి. మీ బాధ్యతలను నెరవేర్చ టంలో బద్ధకించకండి. ఆ విధంగా మీరు మీ బాధ్యత లను నెరవేర్చటం నేర్చుకొ న్నాక, - నేనిక యీ భూమి మీద లేనన్న వార్త విన్నాక కూడా - మామూలుగా మీ రాడుకొనే ఆటలు ఆపకుండా ఆనంద పారవశ్యంలో తేలి యాడగల స్థితిని పొందగలుగు తారు. 'నేనిక లే'నన్న వార్త విన్నాక కూడా మీరు చేస్తున్న పని ఆపివేయకుండా, ఆడుతున్న ఆట విరమించ కుండా వుంటే నేను లేకుండా పోయానన్న ఆ మాటకే అర్థం లేకుండా పోతుంది. మీ రంతా ఆ విధమైన ఆత్మ సంస్కారాన్ని అలవరచుకో గలరని ఆశిస్తున్నాను."

వైసు ప్రెసిడెంట్ యెవరు అనే రాజకీయపు ప్రశ్న దాక, విధి విరామం లేకుండా, డి. ఇ. ఓ గారు ప్రశ్నలవర్షము కురిపించారు. మధ్య మధ్య మాస్టరుగారు కూడా అడ్డు పడుతూ వచ్చాడు. ఈ ప్రశ్నలకు కొంత మంది బాగానే సమాధానాలు చెప్పారు అని డి. ఇ. ఓ గారు సంతోషపడ్డారు. దానినిబట్టి మాస్టరు గారికి సంతోషంగానే వుంది.

చివరకు డి. ఇ. ఓ గారు ఒక కాగితము తీసుకువచ్చి, పిల్లలందరిని సంబోధిస్తూ 'ఓ అబ్బాయిల్లారా! ఈ కాగితము అందరు చూశారుకద. దీని మీద ఒకవైపు మన హిందూదేశపటము వుంది. మాడండి ఎన్ని పర్వతాలో ఎన్ని నదులో ఎన్ని పట్టణాలో! ఎంత పెద్దదేశ మనుకున్నారు మనది! రెండవవైపు చూశారా మీమాదిరే ఒక అబ్బాయి. అందరు చూశారు కదూ. ఇప్పుడొక తమాషా చేస్తాను. ఏమి టంటారా! ఈ కాగితాన్ని యిప్పుడే మీ యెదటే చించేస్తున్నాను ముక్కలుముక్కలుగా. మళ్ళీ మీరు యధాప్రకారంగా ఆ కాగితాన్ని, ఆ ముక్కలు అన్నీ సరిగ్గా అతికించి అదివరకు వున్నమాదిరిగా వుంచాలి. అంటే మళ్లీ మనదేశము, ఆ అబ్బాయి స్పష్టంగా కనిపించాలన్నమాట. ఎవరన్నా చెయ్యగలరా?' అని అడిగాడు.

అమ్మో! ఇన్ని ముక్కలు యెట్లా అతికించగలమండీ అంటూ ఒక అబ్బాయి. ఈ ముక్కలన్నీ అతికించినా కూడ అదివరకు మాదిరిగా వుండదని ఒక అమ్మాయి. రెండు మూడు రోజులు వరసగా కూర్చుని అతికిస్తే సరిగ్గా వస్తుందని యింకొకడు. యీ విధంగా తలోక రీతిగా సమాధానం చెప్పటం మొదలుపెట్టారు. అందులో మోహన్ అనే ఒక తెలివైన పిల్లవాడు నేను చేస్తానండి సరిగ్గాను అని ఆ కాగితపు ముక్కలన్ని తీసుకొని, హిందూదేశపు పటములోని, ముక్కలన్ని అతికించటం మొదలుపెట్టాడు. హిమాలయపర్వతాల దగ్గరవున్న కాగితంముక్క పడమటి కనుమల దగ్గర పెట్టాడు. ఎంతసేపటికీ సరిపోవటం లేదు. కావేరీనదిదగ్గర చించిన కాగితంముక్క గంగానదిదగ్గర అతికించితే అతుకుతుందా! సతమతమయిపోతున్నాడు. ఎంతసేపటికి కుదరటం లేదు. విసుగు పుట్టి ఇక లాభంలేదండి. ఈ దేశం సరిగ్గా రాదండి అనే నిర్ణయానికి వచ్చాడు. ఈమాట అనంగానే శేఖర్ గభాలున లేచి నుంచుని ఈ దేశాన్ని సరిగ్గా నేను అతికిస్తానన్నాడు., మాస్టరుగారు పరమానంద భరితుడయ్యాడు. డి. ఇ. ఓ గారు ఆశ్చర్యంగా చూశాడు.



'ముందర ఆ అబ్బాయిని సరిగ్గా పెడితే దేశం దానంతట అదే సరిగ్గా వుంటుందండి' అన్నాడు శేఖర్.

ఈ మాటల్లో గంభీరమైన భావం వుంది మీరు గ్రహించారా అన్నాడు డి. ఇ. ఓ. మాస్టరుగారిని. తెలియదంటే యెక్కడ తన తెలివి తక్కువ బైటపడుతుందో అని గ్రహించానంటూ తల తోలుబొమ్మలాగ త్రిప్పేశాడు. మాస్టరుగారి గౌరవము దక్కే యోగ్యత వుందికాబోలు, డి.ఇ. ఓ. గారు మళ్లీ ప్రశ్నించలేదు.

'అదెట్లా సాధ్యమవుతుంది?' అంటూ డి. ఇ. ఓ. శేఖర్ ని ప్రశ్నించాడు.

అప్పుడు శేఖర్, 'మా అమ్మ నాకు చెప్పిందండి. ముందర మనం మంచి పిల్లలుగా తయారవ్వాలి. అప్పుడు, నెహ్రూ అంత అవుతారట. తర్వాత దేశం దానంతట అదే బాగుపడుతుందిట. ముందరే, మనం బాగా తయారవక మునుపే దేశాన్ని సరి చెయ్యాలంటె కుదరదుటండీ. అందువలన ముందర నేను యీ అబ్బాయిని సరిగ్గా అతికిస్తే దేశం దానంతట అది సరిగ్గానే వస్తుందని చెప్పానండి' అన్నాడు.

'శభాష్! చాలా బాగుంది. ఇన్నిఊళ్లు తిరిగాను గాని యిలాటి అబ్బాయిని యెక్కడా చూడలేదు.' అంటూ డి. ఇ. ఓ. ప్రత్యేకంగా ఒక మంచి బహుమానాన్ని శేఖర్ కు యిచ్చాడు.

అందువలన, దేశం బాగుపడాలంటే, మనిషి బాగుపడాలి. మనిషి బాగుపడాలంటె, అందరికి శేఖర్ తల్లివంటి తల్లులు వుండాలి. తల్లులవల్ల నే కద పిల్లలు బాగుపడాలిసింది. ఏమంటారు? ★